SmartPrep

# జనవరి 2020 కరెంట్ అఫైర్స్

## తెలుగులో

SmartPrep.in

# జనవరి 2020 కరెంట్ అఫైర్స్


| S No | అంశం | పేజి సంఖ్య |
|---|---|---|
| 1 | అంతర్జాతీయం | 3-5 |
| 2 | జాతీయం | 6-9 |
| 3 | రాష్ట్రీయం | 10-13 |
| 4 | ఆర్థిక రంగం | 14-16 |
| 5 | నియామకాలు | 17-17 |
| 6 | అవార్డులు | 18-20 |
| 7 | వార్తలో వ్యక్తులు | 21-21 |
| 8 | వార్తల్లో ప్రదేశాలు | 22-22 |
| 9 | నివేదికలు & సర్వేలు | 23-23 |
| 10 | క్రీడలు | 24-27 |
| 11 | మరణాలు | 28-28 |
| 12 | సైన్స్ అండ్ టెక్నాలజీ | 29-30 |


SmartPrep.in

# 1.అంతర్జాతీయం

¤ ప్రపంచవ్యాప్తంగా లక్ష కోట్ల చెట్ల పెంపకానికి ప్రపంచ ఆర్థిక వేదిక, ఇతర భాగస్వామ్య సంస్థలు '1టీ.ఓఆర్‌జీ' అనే సంస్థను ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో తమ దేశం చేరుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

¤ బ్రిటన్ రాచరికపు విధుల నుంచి హ్యారీ, ఆయన భార్య మేఘన్ మెర్కెల్ తప్పుకోనున్నారు. ఇకపై 'హిస్ రాయల్ హైనెస్', 'హర్ రాయల్ హైనెస్' (హెచ్‌ఆర్‌హెచ్) అనే బిరుదులు; 'డ్యూక్, డచెస్ ఆఫ్ ససెక్స్' హోదాలు ఉండవు. ఈ మేరకు లాంఛనప్రాయమైన అంగీకార ఒప్పందంపై వాళ్లిద్దరూ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే వారికి ప్రభుత్వ నిధులు అందవు. రాజకుటుంబ సభ్యులుగా నిర్వర్తించాల్సిన విధులు ఉండవు.

¤ శ్రీలంక భద్రతా బలగాలకు కావాల్సిన ఆయుధ కొనుగోలు కోసం భారత్ రూ.355 కోట్ల సాయాన్ని ప్రకటించింది. శ్రీలంకలో పర్యటిస్తున్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ ఆ దేశ అధ్యక్షుడు గొటబాయ రాజపక్సతో సమావేశమయ్యారు.

¤ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రాజ్యాంగ సంస్కరణలను ప్రతిపాదించిన నేపథ్యంలో ఆ దేశ ప్రధాని దిమిత్రి మెద్వదేవ్ తన పదవికి రాజీనామా చేశారు. కొత్త ప్రధానిగా మిషుస్తిన్ పేరును పుతిన్ ప్రతిపాదించారు. ప్రస్తుతం మిషుస్తిన్ ఫెడరల్ ట్యాక్స్ సర్వీసెస్ అధినేతగా ఉన్నారు. పుతిన్‌కు అత్యంత సన్నిహితుడైన మెద్వదేవ్ 2012 నుంచి ఇప్పటి వరకు రష్యా ప్రధానమంత్రిగా పనిచేశారు.

¤ పాకిస్థాన్ మాజీ సైనిక నియంత ముషారఫ్‌కు ప్రత్యేక న్యాయస్థానం విధించిన మరణశిక్ష రద్దయ్యింది. నవాజ్ షరీఫ్ ప్రభుత్వం 2013లో ఆయనపై కేసు పెట్టింది. ఆరేళ్ల విచారణానంతరం ఇస్లామాబాద్‌లోని ప్రత్యేక న్యాయస్థానం 2019 డిసెంబరు 17న ముషారఫ్‌కు మరణశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే, ఆయనపై రాజద్రోహం కేసు నమోదు నుంచి విచారణ వరకు అంతా రాజ్యాంగానికి, చట్టానికి విరుద్ధంగా ఉందని లాహోర్ హైకోర్టులోని త్రిసభ్య ధర్మాసనం తాజాగా ప్రకటించింది.

¤ 'ప్రపంచ అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టులు' పేరిట హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ 2020 సంవత్సరానికి ప్రకటించిన జాబితాలో భారత్ 84వ స్థానంలో నిలిచింది. భారత్‌తోపాటు 58 పాయింట్లు పొందిన మౌరిటానియా, తజకిస్థాన్ కూడా ఇదే స్థానంలో ఉన్నాయి. ముందస్తు వీసా లేకుండా 58 దేశాల్లో పర్యటించవచ్చని ఈ స్కోరు సూచిస్తుంది. గతేడాదితో పోలిస్తే భారత్ 2 స్థానాలు కోల్పోయింది. ప్రపంచ పాస్‌పోర్టు ర్యాంకుల్లో జపాన్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ దేశ పాస్‌పోర్టుతో వీసా లేకుండానే 191

దేశాల్లో పర్యటించొచ్చు. సింగపూర్ (190 దేశాల్లో పర్యటించే వీలు), జర్మనీ, దక్షిణ కొరియా (189), ఫిన్లాండ్, ఇటలీ (188), డెన్మార్క్, లగ్జెంబర్గ్, స్పెయిన్ (187) టాప్-5లో నిలిచాయి. అమెరికా, యూకే ఈ జాబితాలో ఎనిమిదో ర్యాంకులో నిలిచాయి. అఫ్గానిస్థాన్ పాస్‌పోర్టు చిట్టచివరి స్థానంలో, పాకిస్థాన్ చివరి నుంచి నాలుగో స్థానంలో ఉన్నాయి. భారత్ 84వ స్థానంలో నిలిచింది.

¤ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు సంబంధించి తీసుకునే సైనిక చర్యలను పరిమితం చేసేలా 'యుద్ధ అధికారాల తీర్మానాన్ని' ఆ దేశ ప్రతినిధుల సభ ఆమోదించింది. దీనిపై సెనేట్‌లో ఓటింగ్ జరగాల్సి ఉంది. అమెరికా రాజ్యాంగం ప్రకారం సైనిక చర్యకు ఆదేశాలిచ్చే అధికారం కాంగ్రెస్‌కు, అధ్యక్షుడికి మధ్య ఉంది. యుద్ధాన్ని ప్రకటించే అధికారం కాంగ్రెస్‌కు, కమాండర్-ఇన్-చీఫ్ హోదాలో దేశాన్ని రక్షించే క్రమంలో సైన్యాన్ని ప్రయోగించే హక్కు అధ్యక్షుడికి ఉన్నాయి. కాంగ్రెస్ అనుమతి లేకుండా విదేశాల్లో సైనిక చర్య కోసం బలగాలను పంపే రాజ్యాంగ అధికారం అధ్యక్షుడికి ఉంటుందా అనేది అమెరికాలో మొదటి నుంచి చర్చనీయాంశమే. దీనిపై అధ్యక్షుడికి, కాంగ్రెస్‌కు మధ్య వివాదాలుండేవి. ఈ నేపథ్యంలోనే 1973లో 'యుద్ధ అధికారాల చట్టం' అమల్లోకి వచ్చింది.

¤ బ్రిటన్‌లోని ప్రతినిధుల సభ బ్రెగ్జిట్ ఒప్పందానికి ఆమోదముద్ర వేసింది. దీనిపై హౌస్ ఆఫ్ లార్డ్స్ (ఎగువ సభ) నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సాధారణంగా దిగువ సభ తీసుకున్న నిర్ణయంపై ఎగువ సభలో జాప్యం జరగవచ్చు గానీ తిరస్కరించలేదు. జనవరి 31లోగా ఐరోపా సమాజ దేశాల సమాఖ్య నుంచి బ్రిటన్ వైదొలగనుంది.

¤ ఇరాక్‌లో అమెరికా చేపట్టిన డ్రోన్ దాడిలో ఇరాన్ సైన్యంలోని రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ జనరల్ ఖాసిం సులేమానీ (62) చనిపోయారు. లెబనాన్ లేదా సిరియా నుంచి బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద జరిగిన ఈ దాడిలో సులేమానీతోపాటు హాషేద్ అల్ షాబీ దళ డిప్యూటీ చీఫ్ అబూ మహదీ అల్ ముహందిస్ మరణించారు. 'హాషేద్ అల్ షాబీ' అనేది ఇరాక్ పారామిలటరీ దళం. ఈ దళంలో షియా తెగకు చెందిన సాయుధ ముఠాలు ఎక్కువ. వీటికి ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అయినా వీన్ని ఇరాక్ ప్రభుత్వ అధికారిక భద్రతా దళాల్లో విలీనం చేశారు. అపార పోరాట అనుభవమున్న ఈ దళాన్ని 2014లో ఐసిస్ ఉగ్ర ముఠాపై పోరులోకి దించారు.

» జనరల్ సులేమానీకి ఇరాన్ అగ్ర నాయకుడు అయతుల్లా అలీ ఖమైనీ తర్వాత దేశంలో రెండో శక్తిమంతమైన వ్యక్తిగా పేరుంది. పశ్చిమాసియాలో ఇరాన్ సైనిక కార్యకలాపాలను ఈయన పర్యవేక్షించేవారు. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్‌లోని 'అల్ ఖుద్స్

ఫోర్స్'కు 1998 నుంచి నేతృత్వం వహిస్తున్నారు. లెబనాన్‌లో హెజ్‌బొల్లాకు, ఇతర ఇరాన్ అనుకూల తీవ్రవాద గ్రూపులకు సహకరించేవారు. ఇరాక్, సిరియాల్లో ఇరాన్ సైనికంగా వేళ్లూనడానికి కృషిచేశారు. సిరియాలో అధ్యక్షుడు బషర్ అల్ అసద్ సాగిస్తున్న అంతర్యుద్ధం, ఇరాక్‌లో సంఘర్షణలు, ఇస్లామిక్ స్టేట్ తీవ్రవాద గ్రూపుపై పోరాటాల వెనుక సులేమానీదే కీలక పాత్ర.

¤ జనాభాపరంగా ప్రపంచంలో రెండోస్థానంలో ఉన్న భారత్ 2020 జనవరి 1న శిశుజననాల్లో మొదటిస్థానంలో నిలిచింది. కొత్త సంవత్సరం మొదటిరోజు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3,92,078 మంది పిల్లలు పుడితే వారిలో మన దేశంలోనే 65,385 మంది జన్మించారని ఐక్యరాజ్యసమితికి చెందిన శిశుసంరక్షణ సంస్థ యునిసెఫ్ వెల్లడించింది. 46,299 జననాలతో చైనా ఈ జాబితాలో రెండోస్థానంలో నిలిచింది.

## ౨.జాతీయం

¤ భారత వాయుసేన దక్షిణ భారత్‌లో తొలి ౨౨౨ టైగర్ షార్క్స్ స్క్వాడ్రన్‌ని తంజావూరులో ప్రారంభించింది. ఈ మేరకు సుఖోయ్-30ఎంకేఐ యుద్ధ విమానాన్ని తంజావూరు వైమానిక స్థావరంలో చేర్చారు. ఈ యుద్ధ విమానం వాయుసేనతో పాటు నావికా దళానికీ సేవలందించే అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణులను మోసుకెళ్లగలదు. వ్యూహాత్మకంగా కీలకమైన హిందూ మహా సముద్ర ప్రాంతం (ఐఓఆర్)లో భద్రతకు ఇది ఉపయోగపడనుంది.

¤ జమ్మూకశ్మీర్‌లో ప్రీపెయిడ్ మొబైల్స్ సేవల్లో భాగంగా వాయిస్ కాల్స్, మెసేజ్ సర్వీసులపై ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు జమ్మూకశ్మీర్ ప్రధాన కార్యదర్శి రోహిత్ కన్సల్ ప్రకటించారు. సామాజిక మాధ్యమాలపై నిషేధం కొనసాగుతుందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని ౨౦౧౯ ఆగస్టు 5న కేంద్రం రద్దు చేసింది. అనంతరం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రీపెయిడ్ మొబైల్ సేవలను నిలిపివేస్తూ ఇప్పటివరకు ఆంక్షలు అమలు చేశారు.

¤ పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) అమలు చేయకూడదని పంజాబ్ అసెంబ్లీ తీర్మానించింది. ఈ తీర్మానానికి అధికార కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు మద్దతు తెలిపాయి. భాజపా వ్యతిరేకించింది. సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానించిన రెండో రాష్ట్రం పంజాబ్. తొలుత కేరళ ఈ తరహా తీర్మానం చేసింది.

¤ అసోంలోని నిషేధిత తిరుగుబాటు సంస్థ 'నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్ (ఎన్‌డీఎఫ్‌బీ)' హింసాత్మక కార్యకలాపాలను వదిలి, ప్రభుత్వంతో శాంతి చర్చలకు ముందుకొచ్చింది. ఈ దిశగా కేంద్ర, అసోం ప్రభుత్వాధికారులు, ఎన్‌డీఎఫ్‌బీ ప్రతినిధులు త్రైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు.

¤ జాతిపిత మహాత్మాగాంధీకి 'భారత రత్న'ను ప్రకటించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని పరిశీలించడానికి సుప్రీంకోర్టు తిరస్కరించింది. మహాత్మాగాంధీని ప్రజలు లాంఛనప్రాయమైన పురస్కారాలకు అతీతంగా అపరిమిత గౌరవంతో చూస్తారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ. బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.

¤ 'సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్' (సీఆర్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి ఎ.పి. మహేశ్వరి నియమితులయ్యారు. ఆయన యూపీ కేడర్‌కు చెందిన 1984 బ్యాచ్ అధికారి. ప్రస్తుతం కేంద్ర హోం మంత్రిత్వశాఖలో ప్రత్యేక కార్యదర్శి (అంతర్గత భద్రత)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డిసెంబరు 31న ఆర్ఆర్ భట్నాగర్ పదవీ విరమణ చేయడంతో ఈ నియామకం జరిగింది.

¤ కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోల్‌కతాలో 'పూర్వోదయ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తూర్పుతీర ప్రాంతాలైన ఒడిశా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు, ఉత్తరాంధ్రలో ఉక్కు ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేయడం, తద్వారా 20.5 లక్షల ఉద్యోగాలను కల్పించడం ఈ పథకం ఆశయం. ఆయా రాష్ట్రాల్లో అభివృద్ధి చెందని ప్రాంతాల్లోనే వీటిని ఏర్పాటు చేస్తారు. తద్వారా పారాదీప్, హల్దియా, విశాఖపట్నం, కోల్‌కతా లాంటి ప్రధాన ఓడరేవులు అభివృద్ధి చెందుతాయి. కొత్తగా ఉక్కు కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో అనుబంధ పరిశ్రమలు, సామాజిక-ఆర్థిక పరిస్థితులను మార్చే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించడం లాంటి మూడు లక్ష్యాల సాధన కోసం ఈ నూతన పథకం ప్రారంభంకానుంది.

¤ పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమల్లోకి వచ్చినట్లు హోం శాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లో మత పీడనకు గురై, 2014 డిసెంబరు 31కి ముందు భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులను అక్రమ వలసదారులుగా పరిగణించకుండా, వారికి పౌరసత్వం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పౌరసత్వ సవరణ బిల్లును ప్రతిపాదించింది. 2019 డిసెంబరు 10న లోక్‌సభలో, 11న రాజ్యసభలో దానికి ఆమోదం లభించింది. డిసెంబరు 12న రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది.

¤ విజయనగర సామ్రాజ్య రాజధాని, పర్యాటక క్షేత్రం హంపి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. హంపిలో ఏర్పాటు చేసిన కృష్ణదేవరాయ వేదికపై నిర్వహించిన కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్ప పాల్గొన్నారు.

¤ 370 అధికరణం రద్దు తర్వాత జమ్మూ-కశ్మీర్ వ్యాప్తంగా దీర్ఘకాలంగా ఫోన్లు, ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధించడంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఇంటర్నెట్ ద్వారా చేసే భావప్రకటన, వృత్తి, వ్యాపారం, వాణిజ్యం కూడా రాజ్యాంగంలోని 19వ అధికరణం ప్రకారం ప్రాథమిక హక్కు కిందకే వస్తాయని సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి ఈ బెంచ్‌లోని ఇతర సభ్యులు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ)లోని సెక్షన్-144ను పదేపదే విధించడం అధికార దుర్వినియోగం కిందకే వస్తుందని పేర్కొంది. ఈ సెక్షన్ కింద జారీచేసే ఉత్తర్వులు న్యాయసమీక్ష పరిధిలోకి వస్తాయని స్పష్టం చేసింది. ప్రజా జీవితంపై పరిమితులు విధించేలా ఉత్తర్వులు జారీ చేస్తే వాటిని తప్పనిసరిగా బహిర్గతం చేయాలని ఆదేశించింది.

¤ భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్‌తోపాటు 16 దేశాల రాయబారులు శ్రీనగర్‌లో పర్యటించారు. 2019 ఆగస్టులో జమ్మూ కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాక కశ్మీర్ లోయలో ఇతర దేశాల రాయబారులు పర్యటించడం ఇదే తొలిసారి.

¤ దేశవ్యాప్తంగా 983 రైల్వే స్టేషన్లలో రూ.250 కోట్ల నిర్భయ నిధులతో ఇంటర్నెట్ ఆధారిత వీడియో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రైల్వేశాఖకు చెందిన మినీరత్న కంపెనీ- రైల్‌టెల్‌కు బాధ్యతలు అప్పగించారు. తొలిదశలో దేశవ్యాప్తంగా 200 స్టేషన్లలో వీటిని ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటివరకూ 81 స్టేషన్లలో పనులు పూర్తయ్యాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి ప్రశాంతి నిలయం స్టేషన్ ఒకటి. అత్యధికంగా బెంగళూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో 71 కెమెరాలు అమర్చనున్నారు. ముఖ కవళికల ఆధారంగా నేరగాళ్లను గుర్తించే ఏఐని ప్రయోగాత్మకంగా బెంగళూరు, మన్మాడ్, భుసావల్ స్టేషన్లలో నెలకొల్పినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

¤ ఏడేళ్ల కిందట జరిగిన నిర్భయ అత్యాచారం, హత్య కేసులో దోషులైన నలుగురికి దిల్లీ కోర్టు డెత్ వారెంట్ జారీ చేసింది. జనవరి 22న తిహార్ జైల్లో వారిని ఉరితీయాలని తీర్పు వెలువరించింది. ఈలోగా దోషులు తమ న్యాయపరమైన అవకాశాలు వినియోగించుకోవచ్చని సూచించింది. 2012 డిసెంబరు 16న ఒక పారామెడికల్ విద్యార్థినిపై దిల్లీలో ఆరుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వీరిలో ఒకరు మైనర్ కావడంతో మూడేళ్ల శిక్ష పడింది. మరో దోషి జైల్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

¤ ఇళ్లలో వినియోగించే అన్ని రకాల ఎయిర్ కండిషనర్లలో ఉష్ణోగ్రత సూచిక 24 డిగ్రీల సెల్సియస్ వద్ద ప్రారంభమయ్యేలా (డిఫాల్ట్‌గా ఉండేలా) చూడాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 'ఇంధన సమర్థత మండలి' (బీఈఈ)తో సంప్రదించి తాజా ప్రమాణాలను నిర్ణయించారు. దీని ప్రకారం ఇళ్లలో ఏసీ స్విచ్ వేయగానే అది 24 డిగ్రీల సెల్సియస్ వద్ద పనిచేయడం మొదలు పెడుతుంది. జనవరి 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది.

¤ భారత సైన్స్ కాంగ్రెస్ 107వ సమావేశాలను ప్రధాని నరేంద్ర మోదీ బెంగళూరులోని గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం (జీకేవీకే)లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ''ఆవిష్కరించు, మేధో హక్కులు (పేటెంట్) పొందు, ఉత్పత్తి చేయు, అభివృద్ధి చెందు'' అనే సూత్రాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు.

¤ రైలు ప్రయాణికుల ఫిర్యాదుల స్వీకరణకు ఒకే నంబరును కేటాయిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. అత్యవసర సేవలకు 182 నంబర్‌ను కొనసాగిస్తారు. మిగతా అన్ని రకాల ఫిర్యాదుల నమోదుకు 139 నంబర్‌కు కాల్ చేయవచ్చని రైల్వే శాఖ పేర్కొంది. ఈ హెల్ప్‌లైన్ నంబర్ 12 భాషల్లో అందుబాటులో ఉంటుంది.

¤ కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం, ఒకే రేషన్ కార్డు విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, హరియాణా, రాజస్థాన్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, గోవా, ఝార్ఖండ్, త్రిపురల్లో ఈ సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ 12 రాష్ట్రాల్లోని ప్రజాపంపిణీ వ్యవస్థ లబ్ధిదారులు వీటిలో ఏ రాష్ట్రంలో ఉన్నా తమ రేషన్ సరకులు తీసుకోవచ్చు. 2020 జూన్ నాటికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను 'వన్ నేషన్, వన్ రేషన్' విధానానికి అనుసంధానిస్తారు. జూన్ 1 నుంచి కొత్త కార్డులు అందుబాటులోకి వస్తాయి.

SmartPrep.in

# 3.రాష్ట్రీయం

రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)

¤ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం పేరును 'జగనన్న గోరుముద్ద'గా మార్చారు. విద్యార్థులకు 6 రోజులు విభిన్న రకాల ఆహార పదార్థాలను అందించేలా తీర్చిదిద్దిన ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. దీనికోసం ఏటా అదనంగా రూ.344 కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు.

రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)

¤ ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) చట్టం-2014ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆ స్థానంలో అమరావతి మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏఎంఆర్‌డీఏ)ను ప్రవేశపెట్టింది. ఏపీసీఆర్‌డీఏ అధికారాలు, కార్యకలాపాలు, విధులు అన్నీ ఏఎంఆర్‌డీఏకు సంక్రమిస్తాయని ఏపీసీఆర్‌డీఏ రద్దు బిల్లులో వెల్లడించింది. సీఆర్‌డీఏ జారీచేసిన బాండ్లు, తీసుకున్న రుణాలు, ఇచ్చిన హామీలన్నీ ఏఎంఆర్‌డీఏకు బదిలీ అవుతాయని, ఏపీ రాజధాని నగర భూసమీకరణ పథకంతో సహా ప్లాట్ల అభివృద్ధి ఏఎంఆర్‌డీఏ పరిధిలోకి వస్తుందని పేర్కొంది. స్రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ప్రవేశపెట్టిన ఈ బిల్లును శాసనసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

బిల్లులోని ముఖ్యాంశాలు:

» రైతులకు కౌలు (యాన్యుటీ) 10 ఏళ్ల వరకు ఇవ్వాలని గతంలో నిర్ణయించగా, ప్రస్తుతం దాన్ని 15 ఏళ్లకు పెంచారు.

» భూమి లేని ప్రతి పేద కుటుంబానికీ నెలకు రూ.5వేల చొప్పున ఇవ్వనున్నారు.

¤ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి, పాలన వికేంద్రీకరణే లక్ష్యంగా 3 రాజధానులను, జోన్లవారీగా ప్రణాళికాభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన బిల్లును ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టగా, సభ మూజువాణి ఓటుతో దాన్ని ఆమోదించింది.

రాష్ట్రీయం (తెలంగాణ)

¤ 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు తెలంగాణ రాష్ట్రానికి రూ.725 కోట్ల స్థూల నిధులు మంజూరయ్యాయి. ఆర్థిక సంఘం ద్వారా ఏడాదికి రెండుసార్ల చొప్పున అయిదేళ్లుగా ఇస్తూ వచ్చిన స్థూల నిధుల్లో ఇవే చివరివి. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం గడువును పెంచడంతో దాని పూర్తిస్థాయి సిఫారసులు 2020 ఏప్రిల్ నుంచి కాకుండా 2021 ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్నాయి.

రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)

¤ ఆంధ్రప్రదేశ్‌లో 615 ప్రాథమిక పాఠశాలలు, 47 గ్రామీణ ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి నాబార్డు నుంచి రూ.1,048 కోట్ల రుణం మంజూరైంది. సమగ్ర శిక్ష అభియాన్ కింద 510 ప్రాథమిక పాఠశాలలు, గిరిజనాభివృద్ధి, వెనకబడిన తరగతుల సంక్షేమం, సాంఘిక సంక్షేమశాఖల పరిధిలోని 105 రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.515.07 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న 43 ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, 4 కొత్త గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.533.76 కోట్ల రుణం మంజూరు చేసినట్లు నాబార్డు సీజీఎం ఎస్.సెల్వరాజ్ తెలిపారు.

రాష్ట్రీయం (తెలంగాణ)

¤ అయిదో అంతర్జాతీయ కైట్స్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్ సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ పండుగలో అమెరికా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, ఫిలిప్పైన్స్, సింగపూర్ సహా 13 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. స్వీట్ ఫెస్టివల్‌లో 24 రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు స్టాళ్లను ఏర్పాటు చేశారు.

రాష్ట్రీయం (తెలంగాణ)

¤ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛత దర్పణ్-2020 పురస్కారాల్లో పెద్దపల్లి జిల్లాకు చోటు దక్కింది. జిల్లాలో ఇంటింటికి వ్యక్తిగత మరుగుదొడ్డి, ఇంకుడుగుంత, పంచాయతీకొక సామూహిక శౌచాలయం నిర్మించడంతోపాటు వాటికి జియోట్యాగింగ్ పూర్తి చేశారు. జనవరి 12న దిల్లీలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ శ్రీదేవసేన ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నారు.

రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)

¤ 'జగనన్న అమ్మ ఒడి' పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరులో లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు 43 లక్షల మంది తల్లుల ఖాతాలకు రూ.6,456 కోట్లను జమ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ పథకం కింద ఒక్కో తల్లి ఖాతాలో రూ.15వేల నగదు జమ చేస్తామని, ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 82 లక్షల మందికిపైగా విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు.

రాష్ట్రీయం (తెలంగాణ)

¤ సంక్రాంతి పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జనవరి 13 నుంచి 15 వరకు అయిదో అంతర్జాతీయ పతంగులు, మిఠాయిల (కైట్, స్వీట్) పండగను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)

¤ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సుళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ) ప్రారంభమైంది (మూడు రోజులపాటు జరుగుతుంది).

¤ 31వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రారంభించారు. (10 రోజులు జరగనుంది).

¤ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) ఆంధ్రప్రదేశ్ రాజధానిపై తన నివేదికను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సమర్పించింది. ప్రజలకు పరిపాలనను చేరువ చేసేందుకు ఆరు శాటిలైట్ కమిషనరేట్లు ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. అన్ని ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు, రాజధాని నిర్మాణ వ్యయాన్ని తగ్గించేందుకు, విస్తరణ రాజధాని నమూనాను (డిస్ట్రిబ్యూటెడ్ కేపిటల్ మోడల్‌ని) అనుసరించాలని పేర్కొంది. 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం సహా, వివిధ చారిత్రక హామీలనూ, ఇతర అంశాల్నీ దృష్టిలో పెట్టుకుని ఈ సిఫారసులు చేస్తున్నట్టు తెలిపింది. ఆప్షన్-1 ప్రకారం విశాఖలోను, అమరావతిలోను రాజధానిని విస్తరిస్తే నిర్మాణాలకు రూ.4,645 కోట్లు, ఆప్షన్-2 ప్రకారం విశాఖలోనే అన్నీ ఏర్పాటు చేస్తే నిర్మాణాలకు రూ.2,500 కోట్ల నుంచి రూ.3,500 కోట్లు ఖర్చవుతుందని తెలిపింది.

» బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపును 1963లో బ్రూస్ హెండర్‌సన్ స్థాపించారు. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల్లోని 90 నగరాల్లో ఈ సంస్థ కార్యాలయాలున్నాయి. 18,500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అమెరికాలోని బోస్టన్ కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తోంది.

రాష్ట్రీయం (తెలంగాణ)

¤ తెలంగాణ రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో మేధ చాట్‌బోట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేశంలోనే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో కృత్రిమ మేధను అమల్లోకి తెచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)

¤ 2017-18లో ఆహారధాన్యాల ఉత్పాదనలో కోటి టన్నుల కంటే అత్యధిక ఉత్పాదన సాధించిన రాష్ట్రాల విభాగంలో ఆంధ్రప్రదేశ్ కిసాన్ కర్మణ్య పురస్కారం గెలుచుకుంది.

రాష్ట్రీయం - టీఎస్

¤ 80వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రారంభమైంది.

రాష్ట్రీయం - ఏపీ

¤ రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టం అమలు కోసం రూ.87 కోట్లు కేటాయించింది. మహిళలు, బాలలపై జరిగే క్రూరమైన లైంగిక నేరాల సత్వర విచారణకు వీలుగా ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు, రాష్ట్రంలోని మహిళా పోలీసుస్టేషన్ల ఉన్నతీకరణ, ఫోరెన్సిక్ ప్రయోగశాలల బలోపేతం, దిశ కాల్‌సెంటర్, దిశ యాప్‌ల కోసం ఈ నిధులను ఉపయోగిస్తారు.

SmartPrep.in

# 4.ఆర్థిక రంగం

¤ 2019లో ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజీగా (ట్రేడైన కాంట్రాక్టుల సంఖ్య పరంగా) నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) అవతరించింది. డెరివేటివ్ సంఘం ఫ్యూచర్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎఫ్ఐఏ) ఈ గణాంకాలను వెలువరించింది. ఇక ప్రపంచ ఎక్స్ఛేంజీల సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఈ) గణాంకాల ప్రకారం.. క్యాష్ ఈక్విటీ విభాగంలో ఎన్ఎస్ఈ ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచింది. గత అయిదేళ్లలో ఎన్ఎస్ఈ క్యాష్ ఈక్విటీ విభాగం 90% వృద్ధి చెందింది. రోజువారీ సగటు టర్నోవర్ 2018-19 నాటికి రూ.34,264 కోట్లకు చేరింది. ఈక్విటీ డెరివేటివ్స్ విభాగం రోజువారీ సగటు టర్నోవర్ రూ.52,371 కోట్ల నుంచి 70% వృద్ధితో రూ.88,772 కోట్లకు చేరింది.

¤ భారత్‌లో 95.3 కోట్ల మంది వద్ద ఉన్న సంపద కంటే నాలుగు రెట్ల సంపద 1 శాతం మంది వద్దే ఉందని ఓక్స్‌ఫామ్ అనే సంస్థ తన 'టైమ్ టు కేర్' నివేదికలో వెల్లడించింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) 50వ వార్షిక సమావేశంలో ఈ నివేదికను విడుదల చేశారు. మొత్తం భారత కుబేరుల సంపద ఒక పూర్తి ఏడాది బడ్జెట్ కంటే ఎక్కువగా ఉందని కూడా ఈ నివేదిక తెలిపింది.

ముఖ్యాంశాలు:

» ప్రపంచంలో 2153 మంది బిలియనీర్ల వద్ద ఉన్న సంపద భూగోళంపై ఉన్న జనాభాలో 60 శాతానికి సమానమైన 460 కోట్ల మంది వద్ద ఉన్న సంపద కంటే ఎక్కువ.

» అంతర్జాతీయ అసమానతలు దిగ్భ్రాంతికర స్థాయిలో ఉన్నాయి. గత దశాబ్దంలో బిలియనీర్ల సంఖ్య రెట్టింపైంది.

» 63 మంది భారతీయ కుబేరుల మొత్తం సంపద 2018-19 నాటి బడ్జెట్ (రూ.24,42,200 కోట్లు) కంటే కూడా ఎక్కువే.

» ఒక మహిళా కార్మికురాలు 22,277 ఏళ్లు పనిచేస్తే గానీ అగ్రగామి ఐటీ కంపెనీ సీఈఓ ఒక ఏడాదిలో పొందే వేతనాన్ని అందుకోలేరు. ఎందుకంటే సెకనుకు రూ.106 చొప్పున పొందే ఐటీ సీఈఓ ఒక 10 నిమిషాల్లో పొందే వేతనాన్ని సాధించాలంటే ఒక కార్మికుడికి ఏడాది సమయం పడుతుంది.

» మహిళలు, యువతులు ప్రతీ రోజూ ఒక్క పైసా తీసుకోకుండా చేసే ఇంటి పని, పిల్లల సంరక్షణ విధుల కోసం చేసే 32600 గంటల పనిని లెక్కలోకి తీసుకుంటే ఏటా వారు రూ.19 లక్షల కోట్లను భారత ఆర్థిక వ్యవస్థకు జతచేయగలరు. గతేడాది విద్యా బడ్జెట్ (రూ.93,000 కోట్లు)కు ఇది 20 రెట్లు ఎక్కువ.

» ఈ తరహా పనులకు ఊతమిచ్చేలా సంరక్షణ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం నేరుగా పెట్టుబడులు పెడితే 1.1 కోట్ల కొత్త ఉద్యోగాలను సృష్టించవచ్చు.

¤ కేంద్ర బడ్జెట్ ప్రతుల ముద్రణకు ముందు నిర్వహించే హల్వా వేడుకను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి అనురాగ్ ఠాకుర్ దిల్లీలో ప్రారంభించారు. 2020-21 బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియను అత్యంత రహస్యంగా ఉంచుతారు. ఇందులో పాల్గొనే అధికారులు, సహాయ సిబ్బంది మొత్తం పని ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేవరకు నార్త్‌బ్లాక్‌లోని కార్యాలయంలోనే ఉండాలి. ఈ సమయంలో కుటుంబ సభ్యులతో సంబంధాలు ఉండవు. ఫోన్, ఇ-మెయిల్ వంటి వాటిని వినియోగించకూడదు. బయటి వ్యక్తులను లోపలికి అనుమతించరు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టాకే ఈ అధికారులు, సిబ్బంది ఇంటికి వెళ్తారు. బడ్జెట్‌కు తుది రూపు వచ్చిన తర్వాత, ముద్రణకు పంపే ముందు హల్వా వేడుక నిర్వహణ సంప్రదాయంగా వస్తోంది.

¤ టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2019 డిసెంబరులో 8 నెలల గరిష్ఠానికి చేరి, 2.59 శాతంగా నమోదైంది. 2019 నవంబరులో ఇది 0.58 శాతం మాత్రమే. ఉల్లి, బంగాళా దుంపల వంటి ఆహార పదార్థాల ధరలు భారీగా పెరగడమే దీనికి కారణం. ఇది 2018 డిసెంబరులో నమోదైన టోకు ద్రవ్యోల్బణం 3.46 శాతం కంటే తక్కువే. 2019 ఏప్రిల్‌లో నమోదైన 3.24 శాతం టోకు ద్రవ్యోల్బణం తర్వాత మళ్లీ డిసెంబరులోనే అధికంగా నమోదైంది.

¤ 2019 డిసెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 7.35 శాతానికి చేరింది. ఇది అయిదున్నరేళ్ల గరిష్ఠ స్థాయి. 2014 జులైలో నమోదైన 7.39 శాతం తర్వాత మళ్లీ ఇంత ఎక్కువగా నమోదవడం ఇదే తొలిసారి. రిటైల్ ద్రవ్యోల్బణానికి ఆర్‌బీఐ నిర్దేశించుకున్న 6 (4+2) శాతం నియంత్రిత లక్ష్యం కంటే కూడా ఇది ఎక్కువ. 2018 డిసెంబరులో వినియోగ ఆధారిత ద్రవ్యోల్బణ సూచీ (సీపీఐ) 2.11 శాతం. 2019 నవంబరులో 5.54 శాతంగా నమోదైంది.

¤ దేశ విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు జనవరి 3తో ముగిసిన వారానికి 3.69 బిలియన్ డాలర్లు పెరిగి, జీవన కాల గరిష్ఠ స్థాయి అయిన 461.16 బి.డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. సమీక్షా వారంలో, విదేశీ కరెన్సీ ఆస్తులు 427.95 బి.డాలర్లకు (3.01 బి.డాలర్లు పెరుగుదల); పసిడి నిల్వలు 28.06 బి.డాలర్లకు (666 మిలియన్ డాలర్లు పెరిగాయి) చేరాయి. ఐఎంఎఫ్ వద్ద మన దేశ ప్రత్యేక ఉపసంహరణ హక్కులు 1.45 బి.డాలర్లకు (7 మి.డాలర్లు పెరిగాయి); దేశ నిల్వల స్థితి 3.70 బి.డాలర్లకు (3 మి.డాలర్ల పెరుగుదల) చేరినట్లు ఆర్‌బీఐ తన గణాంకాల్లో పేర్కొంది.

¤ 2019-20 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 5 శాతానికి తగ్గే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంక్ తాజాగా అంచనా వేసింది. ఇది 11 ఏళ్ల కనిష్ఠ స్థాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2020-21) ఇది 5.8 శాతానికి పుంజుకోవచ్చని పేర్కొంది.

¤ 2019 డిసెంబరులో రూ.1,03,184 కోట్ల జీఎస్‌టీ వసూళ్లు నమోదయ్యాయి. 2019లో జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్లు దాటడం ఇది వరసగా రెండో నెల. నవంబరులో జీఎస్‌టీ వసూళ్లు రూ.1,03,492 కోట్లకు చేరాయి. డిసెంబరు 2018తో పోలిస్తే డిసెంబరు 2019లో జీఎస్టీ వసూళ్లు 16 శాతం అధికం.

» జీఎస్టీ వసూళ్లలో 2019 డిసెంబరు నెలకు తెలంగాణలో 13 శాతం, ఏపీలో 11 శాతం వృద్ధి కనిపించినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. డిసెంబరు 2018లో ఆంధ్రప్రదేశ్‌లో రూ.2049 కోట్ల వసూళ్లు రాగా.. 2019 డిసెంబరులో రూ.2265 కోట్లు వచ్చాయి. తెలంగాణలో 2018 డిసెంబరులో రూ.3014 కోట్లు, 2019 డిసెంబరులో రూ.3420 కోట్లు జీఎస్టీ కింద వసూలయ్యాయి.

¤ అంధులకు కరెన్సీ నోట్లను గుర్తించడంలో తోడ్పడే 'మొబైల్ ఎయిడెడ్ నోట్ ఐడెంటిఫయర్' (ఎంఏఎన్ఐ - మనీ) అనే మొబైల్ యాప్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ విడుదల చేశారు.

## 5.నియామకాలు

¤ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) చల్లా శ్రీనివాసులు శెట్టి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఎస్‌బీఐలో డిప్యూటీ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న లింగం వెంకట ప్రభాకర్ కెనరాబ్యాంకు ఎండీ-సీఈఓగా నియమితులయ్యారు.

¤ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త డిప్యూటీ గవర్నర్‌గా మైఖేల్ దేబబ్రతా పాత్రా నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. 2019 జూన్‌లో విరాల్ ఆచార్య రాజీనామా చేసిన నేపథ్యంలో ప్రస్తుత నియామకం జరిగింది. ఇప్పటివరకు ద్రవ్యపరపతి విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న పాత్రా ఆర్‌బీఐ నాలుగో డిప్యూటీ గవర్నర్‌గా ఉంటారు. గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆర్‌బీఐలో డిప్యూటీ గవర్నర్లుగా ఎన్ఎస్ విశ్వనాథన్, బీపీ కనుంగో, ఎంకే జైన్‌లు పనిచేస్తున్నారు.

¤ జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) ఛైర్మన్‌గా ప్రొఫెసర్ సురేశ్ చంద్ర శర్మ నియమితులయ్యారు. ఈయన దిల్లీలోని ఎయిమ్స్‌లో ఈఎన్‌టీ హెడ్ అండ్ నెక్ విభాగానికి అధిపతి. జాతీయ వైద్యమండలి (ఎంసీఐ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంసీని ఏర్పాటు చేసింది.

¤ అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ (ఏఎండీ) ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రిసెర్చ్ డైరెక్టర్‌గా డాక్టర్ డీకే సిన్హా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన అదనపు డైరెక్టర్ హోదాలో ఉన్నారు.

# 6.అవార్డులు

¤ 141 మందికి పద్మ పురస్కారాలు 2020 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించింది. మొత్తం 141 మందిని ఇందుకు ఎంపిక చేసింది. ఏటా ఈ అత్యున్నత పురస్కారాలను కేంద్రం ప్రకటిస్తోంది. ఇందులో ఏడుగురిని పద్మ విభూషణ్ వరించగా, 16 మందికి పద్మ భూషణ్, 118 మందికి పద్మశ్రీ అవార్డు వరించాయి.

పద్మ భూషణ్ అవార్డులకు ఎంపికైనవారి జాబితా:

పీవీ సింధు (తెలంగాణ, క్రీడలు)

ఎం. ముంతాజ్ అలీ (కేరళ, ఆధ్యాత్మికం)

సయ్యద్ మౌజం అలీ (బంగ్లాదేశ్, ప్రజావ్యవహారాలు)

ముజఫర్ హుస్సేన్ బేగ్ (జమ్మూకశ్మీర్, ప్రజావ్యవహారాలు)

అజోయ్ చక్రవర్తి (బెంగాల్, కళలు)

మనోజ్ దాస్ (పుదుచ్చేరి, సాహిత్యం & విద్య)

బాలకృష్ణ దోషి (గుజరాత్, ఆర్కిటెక్చర్)

కృష్ణమ్మల్ జగన్నాథన్ (తమిళనాడు, సమాజ సేవ)

ఎస్‌సీ జామిర్ - (నాగాలాండ్, ప్రజావ్యవహారాలు)

అనిల్ ప్రకాశ్ జోషి (ఉత్తరాఖండ్, సమాజ సేవ)

సెరింగ్ లండోల్ (లద్దాఖ్, వైద్యం)

ఆనంద్ మహీంద్రా (మహారాష్ట్ర, వాణిజ్యం & పరిశ్రమలు)

నీలకంఠ రామకృష్ణ మాధవ మీనన్ (కేరళ, ప్రజావ్యవహారాలు-మరణానంతరం)

మనోహర్ పారికర్ (గోవా, ప్రజావ్యవహారాలు-మరణానంతరం)

జగదీశ్ సేఠ్ (అమెరికా, విద్య & సాహిత్యం)

వేణు శ్రీనివాసన్ (తమిళనాడు, వాణిజ్యం & పరిశ్రమలు)

¤ నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ మానవ, పౌర హక్కుల పరిరక్షణ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా ఏటా ఇచ్చే ముకుందన్ సి.మీనన్ అవార్డును 2019 సంవత్సరానికి దిల్లీ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ జి.సాయిబాబాకు ప్రకటించింది. ప్రస్తుతం ఆయన నాగ్‌పూర్ జైలులో ఉన్నారు.

¤ దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్-2019 అవార్డులను మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. స్వర్ణ భారత్ ట్రస్టీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్, సినీ నిర్మాత అల్లు అరవింద్, ఫీనిక్స్ ఛైర్మన్ సురేష్ చుక్కపల్లి అవార్డులు గ్రహీతల్లో ఉన్నారు.

¤ సింధీ భాషా పుస్తకం ''చెక్‌బుక్'' 2019 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక సరస్వతీ సమ్మాన్ పురస్కారానికి ఎంపికైంది. ప్రముఖ రచయిత వాసుదేవ్ మోహి 2012లో ఈ చిరు కథల పుస్తకాన్ని రచించారు. కె.కె. బిర్లా ఫౌండేషన్ 1991 నుంచి వివిధ భారతీయ భాషల్లో ఉత్తమ రచనలకు ఏటా ఈ అవార్డులను అందచేస్తోంది. అవార్డు కింద రచయితకు రూ.15 లక్షల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను ప్రదానం చేస్తారు. సింధీభాషా సాహితీవేత్త అయిన వాసుదేవ్ మోహి పద్యాలు, కథలు, అనువాదాలు తదితరాలు కలిపి 25కు పైగా రచనలు చేశారు. సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు.

¤ ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్-2020 అవార్డుల వేడుక కాలిఫోర్నియాలో ఘనంగా జరిగింది. ఒక ఏడాది కాలంలో సినిమా, టెలివిజన్ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి హాలీవుడ్ ఫారెన్ ప్రెస్ అసోసియేషన్ ఈ అవార్డులను అందిస్తోంది. 1943 నుంచి ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు.

ఉత్తమ చిత్రాలు:

» ఉత్తమ చిత్రం: 1917

» ఉత్తమ చిత్రం (మ్యూజికల్/కామెడీ): వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ హాలీవుడ్

» ఉత్తమ చిత్రం (విదేశీ విభాగం): పారాసైట్

» ఉత్తమ నటుడు: జాక్విన్ ఫోనిక్స్ (జోకర్)

» ఉత్తమ నటుడు (మ్యూజికల్/కామెడీ): టారోన్ ఎగ్రిటాన్ (రాకెట్‌మెన్)

» ఉత్తమ నటి: రీనీ జాల్వెగర్ (జూడీ)

» ఉత్తమ దర్శకుడు: శామ్ మెండిస్ (1917)

» ఉత్తమ స్క్రీన్‌ప్లే: వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ హాలీవుడ్

» ఉత్తమ యానిమేషన్ చిత్రం: మిస్సింగ్ లింక్

SmartPrep.in

# 7.వార్తల్లో వ్యక్తులు

¤ పాకిస్థాన్‌లో జన్మించిన నీతా కన్వర్ (36) అనే మహిళ రాజస్థాన్‌లోని టోంక్ జిల్లా నట్వాడా గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైంది. ఉన్నత చదువుల కోసం 2001లో మాతృభూమిని వదిలి జోధ్‌పూర్ వచ్చిన నీతాకు నాలుగు నెలల కిందటే భారత పౌరసత్వం లభించింది.

¤ బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షాకు ఆస్ట్రేలియా దేశ అత్యున్నత పౌర పురస్కారం లభించింది. భారత్‌లో ఆస్ట్రేలియా హై కమిషనర్ హరిందర్ సింధు ఈ పురస్కారాన్ని కిరణ్ మజుందార్‌కు అందజేశారు. ఈ పురస్కారం అందుకున్న నాలుగో భారత వ్యక్తి కిరణ్. మాజీ క్రికెటర్ సచిన్ తెందూల్కర్, మాజీ అటార్నీ జనరల్ సోలిసొరాబ్జి, మదర్ థెరిసా గతంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

¤ బ్రిటిష్ ఇండియన్ ఈశ్వర్ శర్మ (10 ఏళ్లు) ప్రపంచ బాల మేధావి -2020 అవార్డుకు ఎంపికయ్యాడు. 30 విభిన్నమైన రంగాల్లో ప్రతిభ చూపిన 45 దేశాలకు చెందిన బాల మేధావులకు బ్రిటన్ ఈ అవార్డులు ప్రదానం చేసింది. ఈశ్వర్ ఆధ్యాత్మిక యోగా విభాగంలో అవార్డు అందుకున్నాడు.

# 8.వార్తల్లో ప్రదేశాలు

¤ భారత్ నేపాల్ సరిహద్దుల్లో 'జోగ్‌బని-బిరాట్‌నగర్' ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి వీడియో లింక్ ద్వారా ప్రారంభించారు. ఈ చెక్‌పోస్ట్ నిర్మాణం కోసం భారత్ రూ.140 కోట్ల ఆర్థిక సాయాన్ని నేపాల్‌కు అందించింది. ఇది 260 ఎకరాల్లో ఏర్పాటైంది.

¤ పర్యావరణ పరిరక్షణ, సామాజిక రుగ్మతల నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ హరియాలీ పథకానికి ప్రచారం కల్పించే ఉద్దేశంతో బిహార్‌లో 5.16 కోట్లమంది రాష్ట్రవ్యాప్తంగా 18,034 కి.మీ. పొడవైన మానవహారాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పట్నాలోని గాంధీ మైదాన్‌లో ఈ మానవహారంలో పాల్గొన్నారు.

¤ 2020 సంవత్సరానికి ప్రపంచంలోనే అత్యంత క్రియాశీల నగరాల జాబితాలో హైదరాబాద్ మొదటి ర్యాంక్ దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 130 నగరాలను అధ్యయనం చేసి జేఎల్ఎల్ (జోన్స్ ల్యాంగ్ లాసలె) సంస్థ ఈ జాబితాను రూపొందించింది. వృద్ధి సూచికల ఆధారంగా ఏడేళ్లుగా అత్యుత్తమ నగరాల జాబితాను జేఎల్ఎల్ ప్రకటిస్తోంది. భారత్ నుంచి 7 నగరాలు ఈ జాబితాలో స్థానం పొందాయి. హైదరాబాద్ (1), బెంగళూరు (2), చెన్నై (5), దిల్లీ (6), పుణె (12), కోల్‌కతా (16), ముంబయి (20).

¤ ఆధునిక సదుపాయాలున్న రెండో తేజస్ రైలును గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ అహ్మదాబాద్‌లో ప్రారంభించారు. అహ్మదాబాద్-ముంబయి (500కి.మీ) మధ్య నడిచే ఈ రైలును రైల్వే శాఖకు అనుబంధ సంస్థ అయిన ఐఆర్‌సీటీసీ నడుపుతుంది. తొలి తేజస్ రైలును ఐఆర్‌సీటీసీ దిల్లీ-లఖ్‌నవూల మధ్య నడుపుతున్నారు.

¤ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్గనిస్థాన్ దౌత్య కార్యాలయాన్ని ఆ దేశ ఉప విదేశాంగ మంత్రి నహీద్ ఏసర్ తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు.

¤ మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలో శాతవాహనుల కాలం నాటి బావి వెలుగుచూసింది. క్రీ.పూ.200-230 మధ్య దీన్ని ప్రత్యేకంగా ఇటుకలతో నిర్మించినట్టు తెలుస్తోంది. తేర్ పట్టణంలోని 'రామలింగప్ప లామెచ్యూర్ మ్యూజియం'ను మరో ప్రదేశానికి తరలించేందుకు తవ్వకాలు చేపట్టగా డిసెంబరు 14న ఈ బావి బయటపడినట్టు పురావస్తుశాఖ అధికారులు వెల్లడించారు.

# ౨. సదస్సులు - సమావేశాలు

¤ ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 50వ వార్షిక సదస్సును స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జనవరి 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జర్మనీ ఛాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్, పాకిస్థాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ హాజరుకానున్నారు. భారత్ నుంచి కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్, ప్రముఖ నటి దీపికా పదుకొనె, సద్గురు జగ్గీ వాసుదేవ్ ఈ సదస్సులో పాల్గొంటారు. ఆదాయ అసమానతలు, ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ వైపరీత్యాల విషయంలో దేశాల భిన్న ధోరణులు తదితర అంశాలను ఈ సదస్సులో చర్చించనున్నారు.

¤ బయోఏసియా-2020 అంతర్జాతీయ సదస్సును ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు హైదరాబాద్ హెచ్ఐసీసీలో నిర్వహించనున్నారు.

SmartPrep.in

# 10.క్రీడలు

¤ గువాహాటిలో జరుగుతున్న ఖేలో ఇండియా క్రీడల్లో అండర్-17 బాలుర వెయిట్‌లిఫ్టింగ్ 81 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ షేక్ లాల్ బషీర్ స్వర్ణం సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో వెయిట్‌లిఫ్టర్ రవిశంకర్ (249 కిలోలు) రజతం సొంతం చేసుకున్నాడు. ఈ మూడో సీజన్‌లో ఇప్పటి వరకూ ఆరు స్వర్ణాలతో సహా మొత్తం 14 పతకాలతో తెలంగాణ 15వ స్థానంలో, రెండు బంగారు పతకాలు, 4 రజతాలు, 6 కాంస్యాలతో ఆంధ్రప్రదేశ్ 23వ స్థానంలో ఉన్నాయి.

¤ ఆస్ట్రేలియాతో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మూడో వన్డేలో భారత జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి, మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 286 పరుగులు చేసింది. భారత్ మూడు వికెట్లు కోల్పోయి 47.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్: రోహిత్ శర్మ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్: విరాట్ కోహ్లి.

» అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు సాధించిన భారత సారథిగా విరాట్ కోహ్లి (11,208) రికార్డు సృష్టించాడు. అంతకుముందు ఈ రికార్డు ఎం.ఎస్. ధోనీ (11,207) పేరిట ఉండేది. ధోనీ 330 ఇన్నింగ్స్‌ల్లో ఈ పరుగులు సాధించగా కోహ్లి 199 ఇన్నింగ్స్‌లోనే ఆ ఘనత అందుకున్నాడు.

» వన్డే ఫార్మాట్‌లో అత్యంత వేగంగా అయిదు వేల పరుగులు పూర్తిచేసిన భారత సారథిగా కూడా కోహ్లి నిలిచాడు. ధోనీ 127 ఇన్నింగ్స్‌ల్లో 5వేల పరుగుల మైలురాయి అందుకోగా 82 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించాడు.

» వన్డేల్లో అత్యధిక 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'లు దక్కించుకున్న జాబితాలో కోహ్లి (8) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. గేల్, షాన్ పొలాక్ సరసన కోహ్లి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో సచిన్ (14), జయసూర్య (11) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

» వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన నాలుగో క్రికెటర్‌గా రోహిత్‌శర్మ (29) రికార్డు నెలకొల్పాడు. ఈ జాబితాలో సచిన్ తెందుల్కర్ (49), కోహ్లి (43), రికీ పాంటింగ్ (30) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. అయిదో స్థానంలో సనత్ జయసూర్య (28) ఉన్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా తొమ్మిది వేల పరుగుల మైలురాయిని సాధించిన మూడో క్రికెటర్‌గా కూడా రోహిత్ (217) నిలిచాడు. ఈ జాబితాలో కోహ్లి (194), డివిలియర్స్ (208) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. రోహిత్ తర్వాతి స్థానాల్లో గంగూలీ (228), సచిన్ (235), లారా (239) ఉన్నారు.

» వన్డేల్లో అత్యధిక శతక భాగస్వామ్యాలు సాధించిన మూడో జోడీగా రోహిత్-కోహ్లీ (18) నిలిచారు. ఈ జాబితాలో సచిన్-గంగూలీ (26), దిల్షాన్-సంగక్కర (20) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

» గత ఏడాది జనవరి నుంచి డెత్ ఓవర్లలో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా షమి (19) రికార్డు నెలకొల్పాడు. ముస్తాఫిజుర్ (22) తొలి స్థానంలో ఉన్నాడు.

¤ భారత టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా (33 ఏళ్లు) హోబర్డ్ టోర్నీ డబుల్స్ టైటిల్ గెలుచుకుంది. ఆమె కెరియర్‌లో 42వ డబ్ల్యూటీఏ డబుల్స్ టైటిల్ ఇది. ఫైనల్లో సానియా - నదియా కిచెనోక్ (ఉక్రెయిన్) జోడీ చైనాకు చెందిన షూ పెంగ్, షూ ఝంగ్ జోడీని ఓడించి, విజేతగా నిలిచింది. 2017లో బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ ట్రోఫీ తర్వాత సానియా అందుకున్న తొలి టైటిల్ ఇది.

¤ భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) అధ్యక్షుడిగా కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా ఎన్నికయ్యారు.

¤ రోమ్ ర్యాంకింగ్ సిరీస్ ఈవెంట్‌లో భారత రెజ్లర్ భజ్‌రంగ్ పునియా 65 కిలోల విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకున్నాడు.

¤ రోమ్ ర్యాంకింగ్ సిరీస్ రెజ్లింగ్ టోర్నీలో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ (53 కేజీ) స్వర్ణం గెలుచుకుంది. ఫైనల్లో ఆమె ఈక్వెడార్‌కు చెందిన లిసా ఎలిజబెత్‌పై విజయం సాధించింది. మరో క్రీడాకారిణి అన్షు మాలిక్ 57 కేజీల విభాగంలో నైజీరియాకు చెందిన ఒడునాయో చేతిలో ఓడిపోయి, రజతంతో సరిపెట్టుకుంది.

¤ ఓపెనర్‌గా అతి తక్కువ ఇన్నింగ్స్‌ల్లో 7000 పరుగులు పూర్తి చేసుకున్న బ్యాట్స్‌మన్‌గా రోహిత్‌శర్మ (137 ఇన్నింగ్స్) ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాతో రాజ్‌కోట్‌లో జరిగిన రెండో వన్డేలో అతడీ రికార్డు సృష్టించాడు. దక్షిణాఫ్రికా ఓపెనర్ హాషీమ్ ఆమ్లా (147 ఇన్నింగ్స్) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో సచిన్ (160), దిల్షాన్ (165) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

¤ రెండో వన్డేలో భారత్ 36 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. రాజ్‌కోట్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట భారత్ 6 వికెట్లకు 340 పరుగులు సాధించింది. ఆస్ట్రేలియా 49.1 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటైంది. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

¤ గువాహటిలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ క్రీడల్లో తెలంగాణకు చెందిన దీప్తి, నందిని (అథ్లెటిక్స్), ఫిదెల్ ఆర్.స్నేహిత్ (టేబుల్ టెన్నిస్), తనిష్క్ గౌడ్ (సైక్లింగ్) స్వర్ణ పతకాలు సాధించారు.

¤ మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్ - ఆస్ట్రేలియా మధ్య ముంబయిలో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 10 వికెట్ తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 49.1 ఓవర్లలో 255 పరుగులకే ఆలౌటైంది. లక్ష్యాన్ని ఆసీస్ జట్టు 37.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండానే ఛేదించింది.

¤ 2018-19 సీజన్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించిన భారత క్రికెటర్ జస్‌ప్రీత్ బుమ్రా పాలిఉమ్రిగర్, దిలీప్ సర్దేశాయ్ అవార్డులను అందుకున్నాడు. ముంబయిలో జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అతడికి అవార్డులను ప్రదానం చేశారు. లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ ఉత్తమ అంతర్జాతీయ మహిళా క్రికెటర్ అవార్డును అందుకుంది. సీకేనాయుడు జీవితకాలసాఫల్య పురస్కారాన్ని కృష్ణమాచారి శ్రీకాంత్‌కు, బీసీసీఐ మహిళల జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అంజుమ్ చోప్రాకు ప్రదానం చేశారు.

¤ గువహటిలో జరుగుతున్న ఖేలో ఇండియా క్రీడల్లో అండర్ 17 బాలికల 100 మీ. పరుగులో తెలంగాణకు చెందిన జీవంజి దీప్తి పసిడి పతకం సాధించింది.

¤ 'ఖతర్ ఓపెన్ ఏటీపీ 250' టోర్నీ డబుల్స్ విజేతగా రోహన్ బోపన్న (భారత్), వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్) జోడీ నిలిచింది. దోహాలో జరిగిన ఫైనల్లో బాంబ్రిడ్జ్ (ఇంగ్లండ్) - శాంటియాగో (మెక్సికో) జంటని ఓడించి, 76,870 డాలర్ల ప్రైజ్‌మనీతో పాటు 250 ఏటీపీ ర్యాంకింగ్ పాయింట్లు గెలుచుకున్నారు. బోపన్న ఖాతాలో 19వ డబుల్స్ టైటిల్ ఇది.

¤ కేంద్ర క్రీడల శాఖ మంత్రి కిరెన్ రిజిజు, అసోం ముఖ్యమంత్రి శర్బానంద సోనోవాల్ ఖేలో ఇండియా యూత్ క్రీడలను గువహటిలో ప్రారంభించారు. తొలిరోజు పోటీల్లో జిమ్నాస్ట్‌లు ప్రియాంక దాస్‌గుప్తా (త్రిపుర), జతిన్ కుమార్ (ఉత్తర్‌ప్రదేశ్) స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. 37 రాష్ట్రాల నుంచి దాదాపు 6800 మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

¤ శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌ను భారత జట్టు 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. పుణెలో జరిగిన మూడో టీ20లో 78 పరుగుల తేడాతో లంకను ఓడించింది. మొదట భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు సాధించింది. తర్వాత శ్రీలంక జట్టు 15.5 ఓవర్లలో 123 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన శార్దూల్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. సైని 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. తొలి టీ20 వర్షం వల్ల రద్దవగా, రెండో మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది.

¤ నాలుగు దేశాల (భారత్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, జింబాబ్వే) వన్డే టోర్నీ సిరీస్‌ను భారత్ అండర్ -19 జట్టు గెలుచుకుంది. డర్బన్‌లో జరిగిన ఫైనల్లో భారత జట్టు 69 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట నిర్ణీత 50 ఓవర్లలో భారత జట్టు 7 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేయగా దక్షిణాఫ్రికా 43.1 ఓవర్లలో 190 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్: జురెల్ (భారత్)

¤ మంగళూరులో జరిగిన అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి యర్రాజి జ్యోతి పద్దెనిమిదేళ్ల కిందటి జాతీయ రికార్డును అధిగమించింది. సీనియర్ మహిళల 100 మీ. హర్డిల్స్‌లో 13.037 సెకన్ల టైమింగ్‌తో

లక్ష్యాన్ని చేరుకున్న ఆమె 2002లో అనురాధ బిస్వాల్ (13.38 సె.) నెలకొల్పిన రికార్డును జ్యోతి తిరగరాసింది. ఈమె గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరపున పోటీలో పాల్గొంది. 13.94 సెకన్ల టైమింగ్‌తో జూనియర్ మహిళల 100మీ. హర్డిల్స్‌లోనూ పసిడి కైవసం చేసుకుంది.

SmartPrep.in

# 11.మరణాలు

¤ ప్రపంచంలోనే అతి పొట్టి మనిషిగా గిన్నిస్ రికార్డులకెక్కిన ఖగేంద్ర థాప మగర్ (27 ఏళ్లు) న్యుమోనియా కారణంగా మరణించాడు. నేపాల్‌కు చెందిన ఖగేంద్ర ఎత్తు 2.4 అడుగులు.

¤ క్రికెట్ మాజీ ఆల్‌రౌండర్ రమేశ్ చంద్ర గంగారం బాపూ నడ్‌కర్ణి (86) ముంబయిలో మరణించారు. ఆయన భారత్ తరఫున 41 టెస్ట్ మ్యాచులు ఆడారు. జాతీయ ఎంపిక సంఘ సభ్యుడిగా, ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించారు.

¤ రేడియో రాంబాబుగా శ్రోతలకు సుపరిచితులైన దివి వెంకట్రామయ్య (78) హైదరాబాద్‌లో మరణించారు. కృష్ణా జిల్లా దొండపాడులో జన్మించిన ఆయన 1963లో ఆకాశవాణిలో చేరారు. న్యూస్ రీడర్‌గా, వ్యాఖ్యాతగా, అనువాదకుడిగా 34 ఏళ్ల పాటు సేవలందించారు. సినీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వెలువడిన 'పంతులమ్మ' చిత్రానికి స్క్రిప్టు రచయితగా పనిచేశారు. ఆయన రచనలను ఎమెస్కో 'కథలు', 'ఆకాశవాణిలో నా అనుభవాలు' పేరుతో ప్రచురించింది.

¤ ఆధునిక అరబ్ ప్రపంచంలో సుదీర్ఘకాలం పాలించిన నేతగా పేరుగాంచిన ఒమన్ సుల్తాన్ ఖబూస్ బిన్ మరణించారు. 1970లో తండ్రి నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన ఇప్పటి వరకు సుల్తాన్‌గా కొనసాగారు. చురుకైన విదేశీ విధానంతో ఒమన్‌ని ఆధునికత వైపు నడిపించిన నేతగా పేరు గడించారు. ఆరు దేశాలతో ఇరాన్‌కు కుదిరిన అణు ఒప్పందంలో ఖబూస్ నేతృత్వంలోని ఒమన్ ఉభయపక్షాలకు మధ్యవర్తిగా కీలక పాత్ర పోషించింది. దీంతో గల్ఫ్ దేశాల్లో ఒమన్‌కి ప్రాధాన్యం పెరిగింది.

## 12.సైన్స్ అండ్ టెక్నాలజీ

¤ భారత రక్షణ శాఖ రూ.50వేల కోట్లతో పీ75ఐ అనే ప్రాజెక్టు కింద దేశీయంగా ఆరు జలాంతర్గాములను నిర్మించేందుకు భారత్‌కు చెందిన 2 నౌకా నిర్మాణ సంస్థలను, 5 విదేశీ ఆయుధ తయారీ దిగ్గజాలను ఎంపిక చేసింది. ప్రభుత్వ రంగంలోని మజగావ్ డాక్స్ లిమిటెడ్ (ఎండీఎల్), ఎల్ అండ్ టీ సంస్థలు దీనికి ఎంపికయ్యాయి. రూ.5,100 కోట్లతో దేశీయంగా సైనిక సామగ్రిని సమకూర్చుకోవడానికి కూడా రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. స్వదేశీ పరిజ్ఞానంతో ఆధునికీకరించిన సారంగ్ శతఘ్నులను మార్చి 31 నాటికి సైన్యంలో ప్రవేశపెట్టనున్నారు.

¤ భారత్ తొలిసారిగా చేపట్టబోయే మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'లో పాల్గొనే వ్యోమగాముల ఆరోగ్యాన్ని పరిరక్షించడంపై మన దేశానికి చెందిన శస్త్రచికిత్స నిపుణులకు ఫ్రాన్స్ తర్ఫీదు ఇవ్వనుంది. భారత వైమానిక దళంలోని ఏవియేషన్ మెడిసిన్ విభాగం నుంచి ఈ నిపుణులను ఎంపిక చేస్తారు. 2022లో చేపట్టే గగన్‌యాన్ కింద ముగ్గురిని అంతరిక్షంలోకి భారత్ పంపనుంది. వీరు ప్రస్తుతం రష్యాలో శిక్షణ పొందుతున్నారు.

¤ లక్షణాలు బయటపడకముందే క్షయ వ్యాధిని (టీబీ) గుర్తించే సరికొత్త రక్తపరీక్షను బ్రిటన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. టీబీ అనేది మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌కులోసిస్ అనే బ్యాక్టీరియా కారణంగా వస్తుంది. ఎక్కువగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. క్షయ లక్షణాలు బయటపడటానికి ముందే రక్తంలో దానికి సంబంధించిన ఎలాంటి జన్యు వ్యక్తీకరణ సంకేతం ఆధారంగా ఆ వ్యాధిని గుర్తించవచ్చో శాస్త్రవేత్తలు తాజాగా పరిశీలించారు. 8 సంకేతాల ఆధారంగా 3-6 నెలల ముందే దాన్ని కనిపెట్టవచ్చని పేర్కొన్నారు. ఈ పరిశోధక బృందానికి భారత సంతతికి చెందిన రిషి గుప్తా నాయకత్వం వహించారు.

¤ డీఆర్‌డీవో అధికారులు కె4 బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించారు. విశాఖకు సుదూర ప్రాంతంలో జలాంతర్గామి నుంచి ఈ క్షిపణిని ప్రయోగించగా 3,500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని విజయవంతంగా ధ్వంసం చేసింది. కె4 క్షిపణులను డీఆర్‌డీవో పరిధిలోని డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. 2,500 కేజీల బరువున్న అణ్వాయుధాలను కె4 క్షిపణి నుంచి ప్రయోగించవచ్చు.

¤ భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) రూపొందించిన జీశాట్-30 ఉపగ్రహాన్ని ఏరియన్ 5 వీఏ-251 వాహకనౌక ద్వారా విజయవంతంగా ప్రయోగించారు. ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. జీశాట్-30 బరువు దాదాపు 3,357 కిలోలు. స్టాక్ ఎక్స్ఛేంజ్, టెలిపోర్ట్ అప్‌లింకింగ్, డీటీహెచ్, ఏటీఎంల వీశాట్ అనుసంధానం, ఇ-గవర్నెన్స్ అప్లికేషన్లు, డిజిటల్ శాటిలైట్ వార్తల సేకరణ వంటి సేవలను అందిస్తుందని ఇస్రో అధిపతి డా.కె.శివన్ పేర్కొన్నారు. 2020లో

ఇస్రో ప్రయోగించిన తొలి ఉపగ్రహం జీశాట్-30. ఈ ఏడాది మొత్తం 25 ఉపగ్రహాలను నింగిలోకి పంపాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది.

¤ మానవసహిత ఉపగ్రహం 'గగన్‌యాన్' కోసం భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలో అదనపు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేయనుంది. 'హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్'గా కూడా పిలిచే ఈ కేంద్రం నుంచి గగన్‌యాన్‌కు సంబంధించిన కార్యక్రమాలతోపాటు వ్యోమగాములకు శిక్షణ ఇస్తారు.

¤ పుణెలోని 'నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రోఫిజిక్స్ (ఎన్‌సీఆర్ఏ)' పరిశోధకులు ఒక నక్షత్ర మండలం చుట్టూ విస్తరించి ఉన్న అంతుచిక్కని హైడ్రోజన్ వాయు వలయాన్ని తాజాగా గుర్తించారు. భూమికి 26 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో 'ఏజీసీ 203001' అనే భారీ నక్షత్ర మండలం ఉంది. దాని వ్యాసార్ధం 3.8 లక్షల కాంతి సంవత్సరాలు. పాలపుంతతో పోలిస్తే ఇది 4 రెట్లు పెద్దది. 'ఏజీసీ 203001' చుట్టూ దానికంటే పెద్దదైన తటస్థ హైడ్రోజన్ వలయం విస్తరించి ఉందని 'జెయింట్ మీటర్‌వేవ్ రేడియో టెలిస్కోప్ (జీఎంఆర్‌టీ)' సహాయంతో ఎన్‌సీఆర్ఏ పరిశోధకులు గుర్తించారు.